"ఓ పక్క నిన్ను తేనెటీగలు కుడుతున్నాయి. ఇంకో పక్క ఏ క్షణంలోనైనా ఏనుగులు తమ తొండాలతో నువ్వు ఎక్కిన చెట్టుని కూల్చేసి నిన్ను కాళ్ళతో తొక్కి చంపగలవు. ఐనా ఆ తేనె మీద వ్యామోహాన్ని వదులుకోలేవా? ఆఖరిసారి పిలుస్తున్నాను. రా. లేదా నేను వెళ్ళిపోతాను." ఆశ్చర్యంగా చూస్తూ హెచ్చరించిందా దేవత.

"ఆగు. ఇంక కాస్తే మిగిలింది. ఒక్క నిముషం ఆగు చాలు."

ఆ దేవత మరి కొద్ది నిముషాల సేపు వేచి వుండి, అతన్ని అనేకసార్లు పిలిచినా తేనె రుచి మరిగిన ఆ మనిషి ఆ దేవత రథంలోకి ఎక్కలేదు. విసుగేసి దేవత వెళ్ళిపోయింది.

* * *

ఇది మనందరి కథే. తాత్కాలిక ఆనందాన్ని ఇచ్చే ప్రాపంచిక సుఖాలని వదిలి, శాశ్వతమైన బ్రహ్మానందాన్ని పొందమని మనకి చెప్పే దేవతే సద్గురువు. మనం ప్రాపంచిక సుఖాల కోసం ఆర్జించే ధనమే తేనెధార. మనం మనదిగా భ్రమించే తల్లి, తండ్రులు; భార్యా, పిల్లలు; బంధు మిత్రులు తేనె చుక్కలు. ఫలితంగా మనల్ని చుట్టుముట్టే కష్టాలే తేనెటీగలు. పొంచి వున్న మృత్యువే ఏనుగులు. సద్గురువు మాట వింటే వీటన్నిటి నించి తప్పించుకుని బ్రహ్మానందాన్ని శాశ్వతంగా పొందచ్చు.

## 55. బలహీనుడు

ఓ గ్రామంలో ఓ బలవంతుడైన ఇనప పనివాడు ఉండేవాడు. అతను ఎవరు చేసిన ఎలాంటి ఇనుప గొలుసునైనా పరీక్షించి, అందులోని బలహీనమైన కొక్కెన్ని తేలిగ్గా గుర్తించి దాన్ని తెంపగల బలవంతుడు. పండగలకి ఓ పెద్ద గొలుసుని తెచ్చి దాంతో అతన్ని కడితే, అందులోని అతి బలహీనమైన గొలుసుని తేలిగ్గా కనిపెట్టి, దాన్ని తెంపేసి, చూపరులకి వినోదాన్ని అందించ గలిగేవాడు.

ఓసారి అతను ఓ చట్ట వ్యతిరేకమైన పని చేయడం వల్ల రాజ భటులకి దొరికిపోయాడు. వారు అతన్ని ఓ ఇనప గొలుసుతో బంధించారు. అతను వాళ్ళ

వంక హేళనగా చూసాడు. తనని బంధించిన గొలుసులోని కొక్కేలని ఒక్కొక్క దాన్నీ పరిశీలించాడు. దురదృష్టవశాత్తు అతనికి బలహీనమైన ఒక్క కొక్కెం కూడా ఆ గొలుసులో కనపడలేదు. తనని బంధించిన ఆ గొలుసుని ఎంత ప్రయత్నించినా తెంపలేకపోయాడు. అతను చేసిన గొలుసే అతన్ని బంధించింది.

పాపం విషయంలో కూడా ఇంతే. మనం వ్యామోహాలని జయించగలం, నియంత్రించగలం అనుకుని చెడ్డ అలవాట్లని చేసుకుంటాం. కాని ఓసారి ఏదైనా అలవాటయ్యాక ఇక దాన్ని తెంపగలగడం మన శక్యం కానంతగా, మనకి తెలీకుండానే మనం బలహీనులం అవుతాం. కాబట్టి మనం ప్రతీ పనిని వివేకంతో ఆలోచించి చేయాలి.

## 56. పంది-ఆవు

ఓ గ్రామంలోని ఓ పంది, ఓ ఆవు మంచి మిత్రులు. ఓ రోజు పంది ఆవు దగ్గరకి వెళ్ళి బాధగా చెప్పింది.

"మిత్రమా! ఈ మనుషుల సంగతి నాకేమాత్రం బోధపడటం లేదు. వాళ్ళంతా నీ దయగల కళ్ళని, నీ సాధు గుణాన్ని పొగుడుతూంటారు తప్ప నా గురించి ఒక్క మంచి మాట కూడా మాట్లాడరే? నువ్వు పాలు, పెరుగు, నెయ్యి ఇస్తావన్న మాట నిజమే. కాని నేను నీ కన్నా ఎక్కువే వాళ్ళకి ఇస్తున్నాను. వాళ్ళకి నా మాంసాన్ని, నా చర్మం మీది వెంట్రుకలని ఇస్తాను. నా పాదాలతో వాళ్ళు పచ్చడి చేసుకుని ఇష్టంగా తింటారు. ఐనా నీకు ఇచ్చే గౌరవాన్ని వాళ్ళు నాకెందుకు ఇవ్వడం లేదు?"

ఆవు కొద్ది క్షణాలు ఆలోచించి చెప్పింది.

"తేడా ఎక్కడో చెప్పనా? నేను బ్రతికుండగానే వాళ్ళకి ఇచ్చేదంతా ఇస్తున్నాను. నువ్వు మరణించాక కాని వాళ్ళకి ఏదీ ఇవ్వవు."

చాలామంది తమ చివరి దశలో కూడా బీదలకి సహాయం చేయరు. తమ విల్లు ద్వారా తాము గతించాకే సమాజానికి ఇచ్చేది ఇస్తూంటారు. అలాంటి వారు ఎవరో ఈ చైనీస్ జానపద కథ వివరిస్తోంది.